ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





మరిపెడ మండలం పురుషోత్తమయగూడెం వద్ద కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి, సీతక్క, ఎమ్మెల్యేలు

సీతారాంతండాలో బాధిత కుటుంబంలోని చిన్నారితో మాట్లాడుతున్న రేవంత్



వరద నష్టంపై మానుకోట కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న సీఎం

అధైర్యం వద్దు.. అండగా ఉంటాం..

- అధికారుల అప్రమత్తతతో ఆస్తి, ప్రాణ నష్టాన్ని తగ్గించగలిగాం
- మానుకోట జిల్లాలో 30వేల ఎకరాల్లో పంట నష్టం
- ప్రతీ ఎకరాకు రూ.10వేల పరిహారమిస్తాం
- మూడు తండాల తరలింపుతో మోడల్ కాలనీ
- సీతారాంతండా పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి
- మహబూబాబాద్ కలెక్టరేట్‌లో వరద నష్టంపై సమీక్ష



మహబూబాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వర్షం సృష్టించిన బీభత్సంతో ఎవరూ అధైర్యపడొద్దని.. తమ ప్రజాప్రభుత్వం అండగా ఉంటుందని, మహబూబాబాద్ జిల్లాలో 28 సెంటీమీటర్ల వర్షం పడిందని, జలప్రళయం వచ్చినా అధికారులు అప్రమత్త వ్యవహరించి ఆస్తి, ప్రాణనష్టాన్ని కొంత మేరకు తగ్గించగలిగారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని సీతారాంతండాను మంగళవారం సందర్శించిన ఆయన బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి భరోసా కల్పించారు. తొలుత పురుషోత్తమయగూడెం 365 జాతీయ రహదారిపై 1500 మీటర్ల మేరకు కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలించి.. వాగు ఉధృతితో ఇసుకమేటలు వేసిన ప్రాంతాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహబూబాబాద్ కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్కలతో కలిసి వర్షం, వరద నష్టంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ మానుకోట జిల్లా వ్యాప్తంగా 30వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ఇక వరద బీభత్సంలోనూ నిరంతరం సహాయక చర్యల్లో పాల్గొన్న రెవెన్యూ, పోలీస్, విద్యుత్, వైద్య అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. వరద ముంపునకు గురైన సీతారాంతండా వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించిన సీరోలు ఎస్సై నగేష్ అభినందనీయుడన్నారు. ప్రకృతి వైపరీత్యం వల్ల జిల్లాలో నలుగురు మృతి చెందగా.. వారిలో ఇద్దరు మహబూబాబాద్ జిల్లా వారైతే.. మరో ఇద్దరు పక్క జిల్లా అయిన ఖమ్మానికి చెందిన వారని వివరించారు. అలాగే 215 పశువులు చనిపోయాయని, 45 ట్యాంక్‌లు, మూడు పక్కా ఇళ్లు, 15 కచ్చ ఇళ్లు కూలిపోయాయని, మరో 96 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని, 125 గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడిందని, 680 మందిని వరద ముంపుప్రాంతాల నుంచి తప్పించి వసతి కల్పించామని వెల్లడించారు. చనిపోయిన ప్రతీ వ్యక్తి కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నట్లు ప్రకటించారు. పురుషోత్తమయగూడెం ఆకేరువాగులో కారు గల్లంతయి మృతి చెందిన యువ శాస్త్రవేత్త నూనావత్ అశ్విని, ఆమె తండ్రి మోతీలాల్ వారి స్వగ్రామం ఖమ్మం జిల్లా కారేపల్లి గంగారం తండాకు వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి, ఇందిరమ్మ ఇల్లు కట్టించాలని ఆదేశించామన్నారు.



పొలాల మీదుగా కాలినడకన సీతారాంతండాకు వస్తున్న సీఎం, మంత్రులు

మూడుతండాల తరలింపుతో మోడల్ కాలనీ..

ప్రతీసారి వరద ముంపునకు గురయ్యే పురుషోత్తమయగూడెం శివారు సీతారాంతండాతో పాటు మరో రెండు తండాలను సురక్షిత ప్రాంతానికి తరలించి, ఒక మోడల్ కాలనీగా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయా తండాల వారికి ప్రత్యామ్నాయంగా ఇందిరమ్మ ఇళ్లు, పట్టాలు ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు. జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా నష్టపోయిన ప్రతీ ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. మృతి చెందిన పశువులకు రూ.50వేలు, మేకలు, గొర్రెలకు రూ.5వేల చొప్పున యజమానులకు నష్టపరిహారం అందజేయాలన్నారు. మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలోనే రూ.13కోట్ల నష్టం వాటిల్లిందని, ఇప్పటి వరకు జరిగిన విపత్తును ఎదుర్కోవడం ఒకటైతే.. ఇక ముందు మరేవిధమైన ఇబ్బందులు కలుగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మునిసిపల్, పంచాయతీ రాజ్, వైద్య, రెవెన్యూ అధికారులు ముంపునకు గురైన ప్రాంతాల్లోని ఇండ్లు, రోడ్లు శుభ్రం చేయడానికి నల్లాలు, ట్యాంకర్ల ద్వార నీరందించాలని చెప్పారు. దోమల వ్యాప్తి, అంటు వ్యాధులు రాకుండా ఆరోగ్యశాఖ ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతులను చేయాలని రేవంత్‌రెడ్డి సూచించారు. ఎక్కడైతే నష్టం జరిగిందో ఆ ప్రాంతాల పునరుద్ధరణకు అవసరమైతే

మిగతా 7వ పేజీలో..



రాజకీయ లబ్ధి కోసమే బీఆర్‌ఎస్ విమర్శలు

- రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 3 : వర్షాలతో రైతుల పంట దెబ్బతిని, ప్రజలు కష్టాల్లో ఉంటే ఆదుకునేది పోయి రాజకీయ లబ్ధి కోసం బీఆర్‌ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్, రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. మహబూబాబాద్ కలెక్టరేట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా గంటల్లోనే 42సెంటీమీటర్ల వర్షం కురిసిందని, ఇంతటి విపత్తుఎన్నడూ చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ, జిల్లాలను పర్యటిస్తూ అధికారులను అప్రమత్తం చేస్తున్నారని, రోడ్డు మార్గంలో ప్రయాణిస్తూ నష్టాన్ని పరిశీలించి ప్రజలకు ఓదార్పునిస్తూ అండగా నిలుస్తున్నారని, అలాంటి నాయకుడిపై ప్రతిపక్ష బీఆర్‌ఎస్ నాయకులు విమర్శలు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. మంచి సలహాలు, సూచనలిస్తే స్వీకరిస్తామని, విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ దగ్గర రూ.వేల కోట్లు ఉన్నాయని, అందులో నుంచి రూ.వెయ్యి లేదా రూ.రెండు వేల కోట్లు ఇస్తే తాను కొంతకలిపి నష్ట పోయిన ప్రజల అవసరాలు తీరుస్తామన్నారు. ధ్వంసమైన రోడ్లు, ఇతరత్రా పనులను సత్వరమే మరమ్మతులు చేయించాలన్నారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండి సమన్వయంతో పని చేయడం వల్ల తక్కువ నష్టం జరిగిందని అహర్నిశలు శ్రమించిన జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు.



సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి సీతక్క



విపత్కర సమయాల్లో అధికారులు అంతా అప్రమత్తంగా ఉండి సేవలందించాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు అందరినీ అప్రమత్తం చేశారని దాంతో నష్టం కొంతమేర తగ్గిందన్నారు. మానుకోట జిల్లాలో వర్షాలతో ఇళ్లలోకి నీరు చేరితే, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారని, వర్షాలతో నష్టం జరిగిన జిల్లాలకు తక్షణ సాయం కింద సీఎం రేవంత్‌రెడ్డి రూ.5కోట్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. ధ్వంసమైన రోడ్ల పునరుద్ధరణ కోసం పనులను వేగవంతం చేయాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. తొలుత జిల్లాలో వర్షాలతో జరిగిన నష్టం, తీసుకు న్న సహాయక చర్యలపై కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ పోరిక బలరాంనాయక్, ప్రభుత్వవిప్ జాటోతు రాంచంద్రునాయక్, ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, కోరం కనకయ్య, యశస్వినిరెడ్డి, కేఆర్.నాగరాజు, గండ్ర సత్యనారాయణ, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్, ఆర్డీవో అలివేలు పాల్గొన్నారు. మానుకోట మునిసిపల్ పరిధిలో దెబ్బతిన్న రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ, నాలాల ఏర్పాటుకు రూ.15 కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మునిసిపల్ చైర్మన్ రాంమోహన్ రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్దన్ వినతిపత్రం అందించారు.



హిమానీ, బుజ్జి, నసీమా మృతదేహాలు

ముగ్గురిని బలి తీసుకున్న బొగ్గులారీ

- ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన ఘటనలో ముగ్గురి మృతి
- మృతుల్లో తొర్రూరుకు చెందిన దంపతులు, పాలకుర్తికి చెందిన మహిళ
- జనగామ జిల్లా వావిలాలలో ఘటన

7

పోలీసుల సేవలు భేష్

ఇద్దరు సీఐలు, ఎస్సైని సన్మానించిన సీఎం రేవంత్‌రెడ్డి



మానుకోటలో టౌన్ సీఐ దేవేందర్‌ను శాలువాతో సన్మానించి, అభినందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



రూరల్ సీఐ సర్వయ్యను సన్మానిస్తున్న రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 3 : జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరదముంపు గురైన ప్రాంతాల్లో బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, రైల్వేస్టేషన్‌లలో నిలిచిన పలు రైళ్లలోని ప్రయాణికులకు అల్పాహారం అందించిన, సురక్షిత ప్రాంతాలకు తరలించిన పోలీసుల సేవలుభేష్ అని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. మహబూబాబాద్ జిల్లాలో వర్షాలకు ధ్వంసమైన రోడ్లు, పంటలు, సీతారాం తండాను మంగళవారం ముఖ్యమంత్రి పరిశీలించారు. ఆ తర్వాత కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. కాగా, ఇటీవల కురిసిన వర్షాలకు వరద ముంపుతో కేసముద్రం-ఇంటికన్నె, తాళ్లపూస పల్లి-మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌ల మధ్య రెండు రైల్వే ట్రాక్‌లు కొట్టుకు పోవడంతో కేసముద్రం రైల్వే స్టేషన్‌లో బెంగళూరు-ధన్‌వాడ, ధన్‌వాడ-బెంగుళూరు సంఘమిత్ర అప్‌అండ్‌డౌన్ ఎక్స్‌ప్రెస్‌లు నిలిచి పోయాయి. ఈ రైళ్లలో సుమారు 5,300 మంది ప్ర యాణికులు ఉన్నారు. మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య నేతృత్వంలో వారికి ఆహార ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్ అందించి ఆ ప్రయాణికులను వివిధ వాహనాల ద్వారా కాజీపేటకు సురక్షితంగా తరలించారు. మ హబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో నిలిచిన బీదర్-మచిలీ పట్నం వెళ్లే మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్, గుంటూరు-సికిం ద్రాబాద్ వెళ్లే సింహపురి ఎక్స్‌ప్రెస్ రైళ్ల ప్రయాణికు లకు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ అల్పాహారం, వాటర్ బాటిళ్లు, బిస్కెట్లను అందించారు. ఈ విషయం తెలుసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి సీఐ దేవేందర్ శాలువాలతో ఘనంగా సత్కరించారు. రూరల్ సీఐ సర్వయ్యను రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శాలువాతో సత్కరించి, అభినందించారు.

డీజీపీ ప్రశంసలు..

భారీ వర్షాలతో ఇబ్బందులు పడ్డ బాధితులను ఆదుకునేలా చర్యలు చేపట్టిన మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సీఎం చేతుల మీదుగా సన్మానం పొందిన సీరోలు ఎస్సై నగేష్, టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, రూరల్ సీఐ సర్వయ్యలను డీజీపీ జితేందర్, శాంతిభద్రతల అడిషనల్ డీజీపీ మహేష్ ఎం.భగవత్ ప్రశంసించారు. విధి నిర్వహణలో పలువురికి ఆదర్శంగా నిలిచారని, వారిని కొనియాడారు.

మైనార్టీ పాఠశాలలో విద్యుత్ షాక్ కలకలం?

- విచారణ జరిపిన తొర్రూరు ఎంపీడీవో



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంపీడీవో వేణుమాధవ్

తొర్రూరు, సెప్టెంబరు 3 : పట్టణ కేంద్రంలోని మైనార్టీ పాఠశాల ఓ ప్రైవేటు బిల్డింగ్‌లో కొనసాగుతోంది. గతనెల 30వ తేదీ నుంచి వర్షాలు తీవ్రంగా కురుస్తున్న నేపథ్యంలో గోడలకు నిమ్ము రావడంతో కరెంట్ షాక్ కొడుతుందని విద్యార్థినులు తల్లిదండ్రులకు తెలిపిన సంఘటన ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. మైనార్టీ పాఠశాలలో గత మూడురోజులుగా కరెంట్ లేకపోవడం వల్ల బాలికలకు కనీస అవసరాలకు నీరులేని పరిస్థితి ఏర్పడిందని వారు వాపోయారు. కొందరు విద్యార్థులు ధైర్యం చేసి, తల్లిదండ్రులకు ఫోన్‌చేసి పరిస్థితిని వివరించినట్లు తెలిసింది. అలాగే పలువురు తల్లిదండ్రులు హాస్టల్ వద్దకు వచ్చి తమ పిల్లలను తీసుకువెళ్లడంతో మరికొందరు పిల్లలు తల్లిదండ్రులకు ఫోన్ చేయగా ఈ విషయం బయటకు వచ్చింది. దీనిపై ప్రిన్సిపాల్ వనజను వివరణ కోరగా పాఠశాల ఆవరణలో అందుబాటులో లేదు. ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు. దీంతో మంగళవారం పాఠశాలను జిల్లా అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్‌టొప్పో ఆదేశాల మేరకు ఎంపీడీవో వేణుమాదవ్ తనిఖీచేసి, విద్యార్థుల తల్లిదండ్రులను, విద్యార్థులను విచారణ చేపట్టారు. విద్యార్థులతో విడివిడిగా మాట్లాడి జరిగిన సంఘటనలపై ఆరాతీసి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వారి వివరాలను సేకరించి రికార్డ్ చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు అందించడం జరుగుతుందన్నారు. ఈ తనిఖీల్లో సూపరింటెండెంట్ గోపాల్‌రావు, జేఏ వినయ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.



ఇంటికన్నె సమీపంలో రైల్వే ట్రాక్ వేలాడిన ప్రాంతంలో మట్టికట్ట పోస్తున్న యంత్రాలు

నిరంతరాయంగా..

- తాళ్లపూసపల్లిలో రైల్వే ట్రాక్ మరమ్మతులు పూర్తి
- గూడ్స్ రైలుతో ట్రయల్‌రన్ నిర్వహణ
- ఇంటికన్నె వద్ద రాత్రింబవళ్లు యుద్ధప్రాతిపదికన పనులు
- పునరుద్ధరణ చర్యల్లో వెయ్యి మందికిపైగా సిబ్బంది

7

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లు, పంటల వివరాలను సేకరించి తగిన నివేదిక అందించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ నుంచి మంగళవారం అన్నిమండలాల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, వ్యవసాయాధికారులు, మండల పంచాయతీ విస్తరణ అధికారులు, సంబంధిత అధికారులతో దెబ్బతిన్న గృహాలు, ప్రాణ, ఆస్తి, పశు, పంటనష్టం, ఇతరత్రా అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రుల పర్యటన జరిగిన సందర్భంగా జిల్లాలో భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న గృహాలు, రోడ్లు, చెరువులు, కుంటలు, వాగులు, వంతెనలు, పశుసంపద, పంట నష్ట వివరాలు పూర్తిస్థాయిలో నమోదు చేసుకొనుటకు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సర్వే నిర్వహించి నివేదికలు సమర్పించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాలు, పట్టణాల్లో శానిటేషన్ నిర్వహించడంతో పాటు విషజ్వరాలు ప్రబలకుండా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాస్థాయిలో పురపాలక సంఘాలు, గ్రామపంచాయతీలలో బుధవారం (నేటి) నుంచే ఇంటింటా సర్వే నిర్వహించి ముఖ్యమంత్రి సూచనల ప్రకారం.. చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు.



మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్

రోడ్లు, భవనాలు, చెరువులు, వాగుల మరమ్మతులు కూడా చేపట్టాలన్నారు. వరదల కారణంగా ప్రజల సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డులు, పాస్‌బుక్‌లు పోయినటువంటి వాటిని సంబంధిత రెవెన్యూ అధికారులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్, ఆర్డీవో అలివేలు, జిల్లా అధికారులు నర్మద, విజయనిర్మల, హరిప్రసాద్, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

మానుకోటలో చైన్‌స్నాచింగ్

- మూడు తులాల పుస్తెలతాడు, తులం గొలుసు అపహరణ

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 3 : జిల్లా కేంద్రంలోని 22వ వార్డు కరెంట్ ఆఫీస్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు మహిళ మెడలో ఉన్న మూడుతులాల బంగారు పుస్తెలతాడుతో పాటు.. తులం గొలుసు దోచుకువెళ్లిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం. జిల్లా కేంద్రంలోని కరెంట్ ఆఫీస్ ఏరియాలో ఉంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు అక్కెర రామాచారి-ఉమాదేవి దంపతులు నివాసముంటున్నారు. మధ్యాహ్నం ఉమాదేవి కుట్టుమిషన్‌కాడికి వస్తుండగా, వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఓ గుర్తు తెలియని వ్యక్తి బంగారు ఆభరణాలను ఆపహరించుకుపోయాడు. ఈ విషయమై ఉమాదేవి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

- జిల్లా కేంద్రం శివారు ఈదులపూసపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల తలుపులు పగులగొట్టి పాఠశాలలోని రికార్డులను కిందపడేశారని హెచ్‌ఎం వీరయ్య తెలిపారు. ఈ విషయమై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

మల్యాల కేవీకేకు రాష్ట్ర ఉత్తమ అవార్డు

మహబూబాబాద్ అగ్రికల్చర్, సెప్టెంబరు 3 : జిల్లాలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రానికి రాష్ట్ర ఉత్తమ వ్యవసాయ విస్తీర్ణ సేవా అవార్డు దక్కింది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 10వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్ రాజేందర్‌నగర్ యూనివర్సిటీ విశ్వవిద్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ఉపకులపతి ప్రొఫెసర్ బీజే.రావు, రాష్ట్ర ముఖ్యకార్యదర్శి, జయశంకర్ యూనిర్సిటీ వైస్‌ఛాన్సలర్ ఎం.రఘునందన్‌రావు, రిజిస్ట్రార్ సి.రఘురామిరెడ్డి చేతుల మీదుగా కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ ఎస్.మాలతి ఉత్తమ అవార్డును అందుకున్నారు. మహబూ బాబాద్ జిల్లాలోని వివిధ పంటల్లో ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందించడం, వరిలో నేరుగా విత్తే పద్ధతి విస్తృతంగా చేపట్టడం, పత్తిలో అధిక సాంద్రతపై అవగాహన కల్పించడం, మిర్చిసాగులో సమగ్ర సస్యరక్షణకై అనేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి మహిళలకు అనేక కార్యక్రమాలు, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను మల్యాల కృషి విజ్ఞా కేంద్రానికి రాష్ట్రస్థాయిలో ఉత్తమ విస్తీర్ణ కేంద్రం అవార్డు దక్కింది.



ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రాష్ట్ర ఉత్తమ అవార్డు అందుకుంటున్న కోఆర్డినేటర్ మాలతి

భారీ వర్షాలతో బస్సుల దారి మళ్లింపు

మానుకోట ఆర్టీసీ డీఎం శివప్రసాద్

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 3 : ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో మహబూబాబాద్ డిపో నుంచి వివిధ రూట్లలో నడిచే బస్సుల దారి మళ్లించి ఇతర రూట్లలో నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం ఎం. శివప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాలతో రోడ్లు దెబ్బతినడం బస్సులను ఆ రూట్లలో కాకుండా వేరే ప్రాంతాలకు నడుపుతున్నామని చెప్పారు.

- కురవి-ఖమ్మం రూట్ నందు ముల్కలపల్లి వరకు సెటిల్ సర్వీసులు నడుస్తున్నట్లు తెలిపారు. ఖమ్మం వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం డోర్నకల్-లింగాల మీదుగా ఖమ్మంకు బస్సులు నడుపుతున్నామన్నారు.
- నెక్కొండ- కేసముద్రం- వరంగల్ రూట్‌లో మహబూబాబాద్ నుంచి కేసముద్రం -ఇనుగుర్తి- రెడ్లవాడ, నెక్కొండ మీదుగా వరంగల్‌కు బస్సులు నడుపుతున్నామని పేర్కొన్నారు.
- తొర్రూరు రూట్‌లో మహబూబాబాద్ నుంచి కేసముద్రం, ఇనుగుర్తి, నెల్లికుదురు మీదుగా తొర్రూరుకు బస్సులు నడుస్తున్నాయన్నారు
- సూర్యాపేట రూట్‌లో మహబూబాబాద్ నుంచి ధర్మారం స్టేజీ వరకు, షటిల్ సర్వీసులు నడుపుతున్నామని, మరిపెడ బంగ్లానుంచి సూర్యపేట వరకు సూర్యపేట డిపో బస్సులు నడుస్తున్నాయన్నారు.
- మహబూబాబాద్ నుంచి ఇల్లందు, మహబూబాబాద్ నుంచి నర్సంపేట, వరంగల్, హన్మకొండ, హైదరాబాద్ రూట్లలో బస్సులను యధావిధిగా నడుపుతున్నట్లు డీఎం శివప్రసాద్ తెలిపారు.



శాస్త్రవేత్తలకు ఉత్తమ అవార్డులు, పురస్కారాలు

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 3: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 10వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం హైదరాబాద్‌లో ఉత్తమ శాస్త్రవేత్తలకు అవార్డులు అందజేశారు. ఇందులో వరంగల్ వ్యవసాయ పరిశోధనా స్థానంలో పనిచేస్తున్న ఇద్దరు శాస్త్రవేత్తలు, ఒక సీనియర్ అసిస్టెంట్‌కు అవార్డులు దక్కాయి. ఆ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ బీజే రావు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వైస్ చైర్మన్ ఎం.రఘునందన్ చేతుల మీదుగా వారు అవార్డులను అందుకున్నారు. అవార్డు గ్రహీతలు ఐదేళ్లుగా అపరాల పంటలో నూతన కంది వంగడాలు, పంటలలో పురోగతి, విత్తనోత్పత్తిలో మెరుగైన కృషి చేసినందుకు శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.సంధ్యాకిషోర్ మండవ వెంకటరామయ్య ఉత్తమ శాస్త్రవేత్త అవార్డును అందుకున్నారు. వరిలో నూతన వంగడాల రూపకల్పనలో భాగస్వామ్యం అవడంతోపాటు వరిలో వచ్చే చీడపీడల నివారణ నిర్మూలనకు ఆధునిక పద్ధతిలో రూపొందించడంలో కీలక ప్రాత పోషించినందుకు వరి విభాగంలో కీటక శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.ఓంప్రకాష్ ఉత్తమశాస్త్రవేత్త అవార్డును అందుకున్నారు. అలాగే వరంగల్ వ్యవసాయ ప్రాంతీయ పరిశోధనా స్థానంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న భూక్యా రమేష్ ఉత్తమ సేవా అవార్డును అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న సీనియర్ అసిస్టెంట్ రమేష్, ఓంప్రకాష్, సంధ్యాకిషోర్







కేయూక్యాంపస్, సెప్టెంబరు 3: డిగ్రీ విద్యార్థులకు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా సువర్ణావకాశాన్ని కల్పించింది. క్విజ్‌లో పాల్గొని రూ.10 లక్షలు మొదటి, రూ.8లక్షలు రెండో బహుమతి, అలాగే రూ.6లక్షలు మూడో బహుమతిగా గెలుచుకునే బంపర్ ఆఫర్‌ను వెల్లడించింది. ఈ మేరకు మంగళవారం కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, ఆర్‌బీఐ అధికారి మహ్మద్ అలీ బాబాలు రిజిస్ట్రార్ చాంబర్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. వర్సిటీ పరిధిలో డిగ్రీ చదువుతూ, 25 ఏళ్ల వయస్సు కలిగిన యువతీ, యువకులు క్విజ్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు క్యూఆర్ కోడ్ ద్వారా ఇద్దరు కలిసి గ్రూపుగా వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. క్విజ్ పోటీలు జాతీయ స్థాయిలో నాలుగు రౌండ్‌లుగా జరుగుతాయని తెలిపారు. మొదటి రౌండ్ ఆన్‌లైన్‌లో ఉంటుందని వెల్లడించారు. మొదటి రౌండ్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా రెండో రౌండ్‌కు అర్హత సాధిస్తారని, అయితే రెండో రౌండ్ రాష్ట్రస్థాయిలో జరుగుతోందని పేర్కొన్నారు. అలాగే మూడో రౌండ్ జోనల్ స్థాయిలో జరుగుతోందని వెల్లడించారు. దీనిలో అత్యున్నత ప్రతిభ చూపిన వారికి జాతీయస్థాయిలో నాలుగో రౌండ్ జరుగుతుందని వివరించారు. 2, 3, 4వ రౌండ్‌లు ఆఫ్‌లైన్‌లో జరుగుతాయని, ఆయా రౌండ్‌లకు ఎంపికైన వారికి రవాణా, భోజనం, ఇతర ఖర్చులను ఆర్‌బీఐ భరిస్తుందని పేర్కొన్నారు. కాగా, పోటీల్లో పాల్గొన్న వారందరికీ ఆర్‌బీఐ తరుపున సర్టిఫికెట్లను అందచేస్తారని తెలిపారు. ఇతర వివరాలకు www.rbi.org.inలో చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ అధికారి మహ్మద్ అలీబాబా, లీడ్ బ్యాంకు ఆఫీసర్ హవేలీరాజు, ఫైనాన్సియల్ లిటరసీ క్రెడిట్ కౌన్సిలర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు ఆర్‌బీఐ ఆధ్వర్యంలో క్విజ్ పోటీ

పోస్టర్ ఆవిష్కరించిన కేయూ రిజిస్ట్రార్, ఆర్‌బీఐ అధికారి



క్విజ్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి, అధికారులు







అధైర్యం వద్దు.. అండగా ఉంటాం

(5వ పేజీ తరువాయి)

సమీప ప్రాంతాల రెవెన్యూ, పోలీసులను రప్పించి, రంగంలోకి దింపాలన్నారు. ఎక్కడైతే ప్రమాదాలు, వరదల నష్టం జరుగుతుందో ఆయా ప్రాంతాలను గుర్తించి బ్లూబుక్ తయారు చేసి కలెక్టరేట్‌లో ఉంచాలని అధికారులను ఆదేశించారు. మున్ముందు ఇలాంటి విపత్తులు ఏర్పడే అవకాశం ఉంటే అధికారులు మారినా.. ఆ బ్లూబుక్‌లోని సమాచారం ద్వారా చరిత్ర పునరావృతం కాకుండా జాగ్రత్తపడే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాకు చెందిన మంత్రులు, ఇన్‌చార్జ్ మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రజల మధ్యనే ఉండి ప్రజల కష్టనష్టాలను తెలుసుకుని అధికారులకు వివరించి అన్ని విధాలుగా ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. తమ ప్రభుత్వం బురద.. వరద రాజకీయాలు చేయదని, చిత్తశుద్ధితో పనిచేస్తుందని చెప్పారు. స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు వరద బాధితుల సాయం కోసం ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.



సీతారాంతండాలో వరద బాధితులతో మాట్లాడుతున్నసీఎం రేవంత్‌రెడ్డి

మానుకోటలోనూ హైడ్రా తరహా చర్యలకు ఆదేశం

మహబూబాబాద్ జిల్లాలో ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలు, నాలాలు కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలను కూల్చివేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో అక్రమణల కూల్చివేతకు శ్రీకారం చుట్టిన హైడ్రా తరహాలోనే ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ నాలా చెరువులను ఆక్రమిస్తే కూల్చివేయడానికి కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నామని వెల్లడిచారు. చెరువులు, నాలాలు, బఫర్‌జోన్‌ల ఆక్రమణల వల్లనే భారీ వర్షాలు చోటు చేసుకున్నప్పుడు వరద ముంపుతో తీవ్రనష్టం వాటిల్లుతుందన్నారు. రాష్ట్రమంతా చెరువులు, నాలాల ఆక్రమణలపై స్పెషల్ డ్రైవ్‌లు చేపడుతామని చెప్పారు. ప్రకృతిని చెరబట్టాలని చూస్తే ప్రకృతి ప్రకోపాన్ని చూడాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ఉత్తరాఖండ్, తెలంగాణ, విజయవాడ, హైదరాబాద్ ఎక్కడైనా సరే ప్రకృతిమీద దాడిచేస్తే తప్పకుండా దుష్ఫలితాలు చూడాల్సి వస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆక్రమణలకు సంబంధించి హైకోర్టు ఇతరత్రా ఏ కోర్టుల్లో కేసులు ఉన్నా.. చట్టపరంగా, న్యాయపరంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూములు, కుంటలు, చెరువులను ఆక్రమించిన భూ కబ్జాదారులు ఎంతటి వారైనా వదిలేది లేదని, ఎంతటి ఒత్తిడి వచ్చినా.. వెనక్కి తగ్గేది లేదని తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని పునరుద్ఘాటించారు. అక్రమంగా కట్టడాలు చేపట్టి ఉంటే వెంటనే స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అప్పగించాలని కోరారు. లేని పక్షంలో తామే చర్యలు తీసుకుని కూల్చివేయిస్తామన్నారు. చెరువులు, నాలలు ఆక్రమణలకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వవిప్ జాటోతు రాంచంద్రునాయక్, ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, మామిడాల యశస్వినిరెడ్డి కోరం కనకయ్య, కేఆర్.నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, మునిసిపల్ ఛైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పొ, ఎం.డేవిడ్ పాల్గొన్నారు.

సీతారాంతండా బాధితులకు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అండ



సీఎంకు తన జీతం చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

మరిపెడ మండలం తండాధర్మారం శివారు సీతారాం తాండా ముంపు బాధిత కుటుంబాల సహార్థం కోసం పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తన ఒకనెల వేతనం రూ.2.75 లక్షలను విరాళంగా ప్రకటించారు. ఈ సందర్భంగా సీతారాంతాండాలో సీఎం రేవంత్‌రెడ్డికి విరాళానికి సంబంధించిన చెక్కును మల్లన్న అందచేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్ఈలు కృష్ణారెడ్డి, సురేందర్, డీఈఈ అనూష, శ్రీనివాస్, మరిపెడ తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో విజయ, ఎంపీవో సోమ్లానాయక్ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న విద్యార్థిని

కిడ్డీబ్యాంకులో దాచుకున్న రూ.3వేలను సీఎంకు అందజేసిన సాయిసింధు

మహబూబాబాద్ టౌన్ : వరదలో మహబూబాబాద్ జిల్లా అతలాకుతలమైన వేళ మహబూబాబాద్ పట్టణానికి చెందిన పదో తరగతి విద్యార్థిని చలించిపోయింది. తన తల్లిదండ్రులు పాకెట్ మనీగా ఇవ్వగా కిడ్డి బ్యాంకులో దాచుకున్న రూ.3వేలను వరద బాధితుల సహాయార్థం అందించి పెద్దమనుసును చాటుకుంది. మహబూబాబాద్ పట్టణానికి చెందిన ముత్యాల గీతవాణి- ప్రవీణ్‌కుమార్ దంపతుల కుమార్తె సాయిసింధు స్థానిక ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన జిల్లావాసులకు అండగా ఉండేందుకు తాను దాచుకున్న డబ్బు రూ.3వేలను ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించేందుకు గాను మంగళవారం మానుకోటకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి ఇచ్చింది. దీంతో సీఎం సింధును అభినందించారు.



సీఎం సహాయనిధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రూ.3వేలను అందిస్తున్న చిన్నారి సాయిసింధు

శరవేగంగా జాతీయ రహదారి మరమ్మతులు



శరవేగంగా సాగుతున్న జాతీయ రహదారి మరమ్మతు పనులు



వరద ఉధృతికి పాడైన జాతీయ రహదారిని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మరిపెడ, సెప్టెంబరు 3 : భారీ వర్షాలతో ఆకేరు నది వరద ఉధృతితో మరిపెడ మండలం పీఎస్‌గూడెం దగ్గర పాడైన 365 జాతీయ రహదారి పునరుద్ధరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనులను మంగళవారం సీతారాంనాయక్‌తండాకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. పునరుద్ధరణ పనులు తాత్కలికంగా చేపట్టినప్పటికి మళ్లీమళ్లీ ఇలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు పకడ్బందీ, పక్కా ప్రణాళికలతో నివేదికలు తయారు చేయాలని సూచించారు. జిల్లా అధికార యంత్రాం గం పీఎస్ గూడెం బ్రిడ్జి దగ్గర మూడు ప్రొక్లయినర్లను ఏర్పాటు చేసి, పనులు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల్లో పనులు పూర్తి చేసి రోడ్డు మార్గం పునరుద్ధరించేలా పనులు జరుగుతున్నాయి.

సీరోలు ఎస్సై నగేష్‌కు సీఎం సత్కారం



సీరోలు ఎస్సై నగేష్‌ను సత్కరిస్తున్న సీఎం, మంత్రులు

సీరోలు , సెప్టెంబరు 3 : వరదలతో నీట మునిగిన సీతారాంతండా ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించిన సీరోలు ఎస్సై నగేష్ సేవలు భేష్ అని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. మహబూబాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించిన సీఎం సుమారు 100 మంది తండావాసులను సీరోలు ఎస్సై నగేష్ తన సిబ్బందితో కలిసి సురక్షిత ప్రాంతాలకు తరలించారని, ఈ క్రమంలో నడవలేని స్థితిలో ఉన్న 60 ఏళ్ల వృద్ధురాలిని కావడికి జోలెకట్టి స్వయాంగా ఆయన కావడి మోసి సురక్షిత ప్రాంతానికి తరలించి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మంత్రులు పొంగులేటి, సీతక్కతో కలిసి నగేష్‌ను సత్కరించారు.

సీఎం పర్యటన సాగిందిలా..

మరిపెడ, సెప్టెంబరు 3 : మరిపెడ మండలంలో మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి పర్యటన 32నిమిషాల పాటు కొనసాగింది. ఖమ్మం నుంచి రోడ్డుమార్గంలో మ ధ్యాహ్నం 12.54నిమిషాలకు సీతారాంతండా స్టేజీకి చేరు కున్న ఆయన తొలుత మంత్రులు, అధికారులతో కలిసి ధ్వంసమైన జాతీయ రహదారిని పరిశీలించారు. అక్కడి నుంచి కాలినడకన 1.03 నిమిషాలకు సీతారాంతండాకు చేరుకున్నారు. 10నిమిషాల పాటు పలువురు బాధితుల ఇళ్లకు వెళ్లి జరిగిన నష్టం గురించి తెలుసుకున్నారు. రోధిస్తున్న బాధిత కుటుంబాల వారిని ఓదార్చారు. 1.13 నిమిషాలకు బాధిత కుటుబాలను ఉద్దేశించి 11 నిమిషాలు వారితో మాట్లాడారు. 1.26 నిమిషాలకు కాన్వాయ్ ద్వారా మహబూబాబాద్ కలెక్టరేట్‌కు బయలుదేరి వెళ్లారు. 1:45 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకున్న సీఎం ఫొటోప్రదర్శన తిలకించి 1:50 గంటలకు సమీక్ష ప్రారంభించారు. 2:35 గంటలకు సమీక్ష ముగించుకుని వెళ్లిపోయారు.

నిరంతరాయంగా..

- తాళ్లపూసపల్లిలో రైల్వే ట్రాక్ మరమ్మతులు పూర్తి
- గూడ్స్ రైలుతో ట్రయల్‌రన్ నిర్వహణ
- ఇంటికన్నె వద్ద యుద్ధప్రాతిపదికన పనులు
- పునరుద్ధరణ పనుల్లో వెయ్యి మందికిపైగా సిబ్బంది



ఇంటికన్నె సమీపంలో రైల్వే ట్రాక్ మరమ్మతు పనుల్లో కూలీలు

కేసముద్రం, సెప్టెంబరు 3 : ఇటీవలి భారీ వర్షం, వరద బీభత్సం కారణంగా సికింద్రాబాద్-విజయవాడ సెక్షన్‌లోని మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి-మహబూబాబాద్ రైల్వే స్టేషన్ల మధ్య, కేసముద్రం-ఇంటికన్నె రైల్వేస్టేషన్ల మధ్య వరద ప్రవాహానికి ట్రాక్ ధ్వంసమై రైళ్ళ రాకపోకలు పూర్తిగా నిలిచిన విషయం తెలిసిందే. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు పడిన భారీ వర్షం కారణంగా తాళ్లపూసపల్లి-మహబూబాబాద్ రైల్వేస్టేషన్ల మధ్య 432, 434 కిలోమీటరు వద్ద సుమారు 20 మీటర్ల పొడవు, అలాగే ఇంటికన్నె వద్ద 418 కిలోమీటరు వద్ద 40 మీటర్ల పొడవు రైల్వే ట్రాక్ వరద తాకిడికి ధ్వంసమైంది. ఫలితంగా శనివారం రాత్రి నుంచి సికింద్రాబాద్-విజయవాడ సెక్షన్ల మధ్య రైళ్ల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో అప్రమత్తమైన రైల్వే శాఖ ఆదివారం సాయంత్రం నుంచే పట్టాల మరమ్మతు పనులు చేపట్టి నిరంతరాయంగా కొనసాగిస్తోంది. దీంతో తాళ్లపూసపల్లి-మహబూబాబాద్ మధ్య మంగళవారం ఉదయం వరకు ట్రాక్‌ను సిద్ధం చేసి మధ్యాహ్నం ట్రయల్ రన్‌లో భాగంగా గూడ్స్ రైలును కూడా నడిపించారు. ఇక ఇంటికన్నె వద్ద ట్రాక్ బాగా దెబ్బతినడంతో మరమ్మతు పనులకు సమయం పడుతోంది. సోమవారం ఉదయం నాటికి వరద ప్రవాహం కొంత తగ్గుముఖం పట్టడంతో ఎనిమిది ఎక్స్‌కవేటర్ యంత్రాలను తీసుకువచ్చి రైలు కట్ట పటిష్ఠం కోసం మంగళవారం సాయంత్రం వరకు మట్టికట్టను పోశారు. యంత్రాలతో కంకర నింపుతున్నారు. మరోవైపు ఇదే ప్రాంతంలో పాక్షికంగా దెబ్బతిన్న రైల్వే ట్రాక్ వద్ద సిబ్బందితో మరమ్మతులు చేయిస్తున్నారు. ఇక్కడ రైల్వే ఇంజనీరింగ్ కార్మికులు, ఓహెచ్ఈ(ఓవర్ హెడ్ ఎలక్ట్రికల్స్), కమ్యూనికేషన్స్ తదితర విభాగాలకు సంబంధించిన వెయ్యి మందికి పైగా సిబ్బంది మరమ్మతు పనుల్లో పాల్గొనడం గమనార్హం. మంగళవారం రాత్రి పట్టాలను ఏర్పాటు చేయడం, కంకర ప్యాకింగ్ పూర్తి చేసి బుధవారం మధ్యాహ్నం వరకు రైలు పట్టాల పునరుద్ధరణ జరిగే అవకాశం ఉందని రైల్వే వర్గాలు భావిస్తున్నాయి.

రైళ్ల పునరుద్ధరణకు మరో రెండురోజులు!

కాజీపేట, సెప్టెంబరు 3: భారీవర్షాల నేపథ్యంలో ఇంటికన్నె-కేసముద్రం, తాళ్లపూసలపల్లి-మహబూబాబాద్ మధ్య రైల్వే ట్రాక్ దెబ్బతినడంతో విజయవాడ వైపు వెళ్లే అన్ని రైళ్లను రద్దుచేసిన సంగతి తెలిసిందే. విజయవాడ వైపు వెళ్లే రైళ్లు మంగళవారం సైతం రద్దు చేశారు. ఆ రూట్‌లలో రైళ్ల పునరుద్ధరణకు మరో రెండురోజులు పట్టే అవకాశం ఉందని రైల్వే అధికారులు చెబుతున్నారు. తాళ్లపూసలపల్లి - మహబూబాబాద్ మధ్య దెబ్బతిన్న రైల్వే ట్రాక్‌ను రైల్వే సిబ్బంది రేయింబవళ్లు పనిచేయడంతో ఆ ట్రాక్‌ను మంగళవారం మరమ్మతును పూర్తి చేశారు. ఆ ట్రాక్‌పై ట్రయల్ రన్ సైతం పూర్తి చేశారు. ఇదే రూట్‌లో ఇంటికన్నె - కేసముద్రం మధ్య దెబ్బతిన్న రైల్‌ట్రాక్ పునరుద్ధరణ పనులు ఇంకా కొనసాగుతున్నాయి, ఈ ట్రాక్ మరమ్మతులు పూర్తిచేస్తేనే ఆ రూట్‌లో రైళ్లు నడుప నున్నామని, అందుకు మరోరెండు రోజులు పట్టే అవకాశం ఉందని రైల్వే అధికారులు తెలిపారు.

ముగ్గురిని బలితీసుకున్న బొగ్గులారీ

ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన ఘటనలో ముగ్గురి మృతి

- మృతుల్లో తొర్రూరుకు చెందిన దంపతులు, పాలకుర్తికి చెందిన మహిళ
- జనగామ జిల్లా వావిలాలలో ఘటన



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డి

పాలకుర్తి/తొర్రూరు రూరల్, సెప్టెంబరు 3 : మృత్యువై దూసుకొచ్చిన ఓ బొగ్గులారీ ముగ్గురిని బలితీసుకుంది. మూలమలుపు వద్ద ఆ లారీ బస్సును ఢీ కొట్టడంతో బస్సులో ప్రయాణిస్తున్న దంపతులు సహా ఓ మహిళ మృతిచెందారు. మరో నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని వావిలాల గ్రామ శివారులో మంగళవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డిపో నుంచి పాలకుర్తి- తొర్రూరు షటిల్ సర్వీసుగా ఓ ఆర్టీసీ బస్సు పాలకుర్తి నుంచి తొర్రూరుకు మొత్తం 18మంది ప్రయాణికులతో వెళుతోంది. ఈ క్రమంలో పాలకుర్తి మండలం వావిలాల గ్రామ శివారులో మూలమలుపు వద్ద తొర్రూరు నుంచి పాలకుర్తి వైపు వస్తున్న ఓ బొగ్గు లారీ ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం టీక్యాతండాకు చెందిన జాటోతు హేమాణి(55), బుజ్జి (50) దంపతులతో పాటు పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన ఎండి.నసీమా (55) మృతి చెందా రు. అలాగే జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదం జరిగిన తీరును ఆరా తీశారు. అయితే బొగ్గులారీ డ్రైవర్ మద్యం మత్తులో బస్సు నడపడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని తెలుస్తోంది. ఈ ఘటనలో మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం టీక్యాతండాకు చెందిన జాటోతు బాలాజీ, వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన కోలపల్లి భూలక్ష్మీ, ఎర్ర సత్యవతి, పాలకుర్తి మండలం నారబోయినగూడెం గ్రామానికి చెందిన తిరుపల్లి నాగమ్మకు స్వల్ప గాయాలయ్యాయి.



తొర్రూరులో చికిత్స పొందు తున్న జాటోతు బాలాజీ

కుమారుడు, కూతురు వద్దకు వెళ్లి వస్తుండగా..

హేమాణి, బుజ్జి దంపతులు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న తమ చిన్న కుమారుడు సుమన్, కుమార్తె అరుణలను చూసేందుకు నాలుగు రోజుల క్రితం మరో ఇద్దరు కుటుంబసభ్యులతోకలసి వెళ్లారు. తిరిగి హైదరాబాద్ నుంచి సోమవారం ఇంటికి బయల్దేరిన వారు సాయంత్రానికి దేవరుప్పల మండలం పెద్దతండా శివారు దోనెబండ తండాలో నివాసం ఉండే బుజ్జి సోదరి అయిన బానోతు రుక్కి ఇంటికి వెళ్లారు. రాత్రి అక్కడే బస చేసిన ఆ నలుగురు మంగళవారం తెల్లవారు జామున దోనెబండ తండా నుంచి పాలకుర్తి చేరుకుని.. అక్కడ తొర్రూరు వెళ్లే బస్సు ఎక్కారు. మార్గమధ్యలో వావిలాల వద్ద జరిగిన ప్రమాదంలో బస్సులో కుడివైపు కూర్చున్న హేమాని, బుజ్జి దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ క్రమంలో హేమానీ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రగాయాల పాలైన హేమాని బార్య బుజ్జిని తొర్రూరులోని ప్రైవేటు ఆసత్రికి తర లించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతులకు ఇద్ద రు కుమారులు సోములు, సుమన్, అరుణ ఉన్నారు. ఇక మరో మృతురాలు ఎండి. నసీమాది పాలకుర్తి మండల కేంద్రం. నసీమా తొర్రూరు మండలం నాంచారిమడూరు గ్రామశివారులోని మహత్మాజ్యోతిబాపూలే డిగ్రీ గురుకుల కళాశాలలో ఔట్ సోర్సింగ్ వంట మనిషిగా పని చేస్తోంది. రోజులాగే విధులకు వెళ్లే క్రమంలో ఆమె ప్రమాదానికి గురైంది. నసీమాకు భర్త బడేసాబ్ కుమారులు యాకూబ్, మహబూబ్‌పాషా ఉన్నారు.

ఘటనా స్థలిని సందర్శించిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

ప్రమాద విషయం పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి ఘటన స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ముగ్గురు మృతి చెందడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఆమె బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అయితే ఎమ్మెల్యే ఆస్పత్రిని సందర్శించిన సమయంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో కలెక్టర్‌కు ఫోన్ చేసి గైర్హాజరైన వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మృతురాలు నసీమా భర్త బడేసాబ్‌తో మాట్లాడి ఓదార్చారు. బీఆర్ఎస్ తరుపున ఆదుకుంటామని భరోసానిచ్చారు.

లారీ డ్రైవర్ మద్యం తాగడమే కారణమా?

ఆర్టీసీ బస్సును ఢీ కొట్టి ముగ్గురు మృతికి కారణమైన బొగ్గు లారీ డ్రైవర్ మద్యం సేవించి వాహనాన్ని నడపడం వల్ల ఈ ఘోర ప్రమాదం జరిగిందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఘటనకు అరగంట ముందు సదరు డ్రైవర్ వావిలాల గ్రామంలో లారీ నిలిపి బెల్ట్ దుకాణంలో మద్యం తాగినట్లు తెలిసింది. ఆ డ్రైవర్ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించగా.. ఘటన జరిగిన కొద్దిసేపటికే డ్రైవర్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం.

దంపతుల మృతితో టీక్యాతండాలో విషాదం

పాలకుర్తి మండలం వావిలాల గ్రామశివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తొర్రూరు మండలం మండలం వెల్లికట్టె గ్రామ శివారు టీక్యాతండాకు చెందిన జాటోతు హేమానీ(60) బుజ్జమ్మ(55) దంపతులు మృతిచెందడంతో తీవ్ర విషాదం నెలకొంది. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించే వీరు హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడు సుమన్, కుమార్తె అరుణను చూసివచ్చేందుకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో ప్రమాదానికి గురై మృతిచెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

ఎన్పీడీసీఎల్‌కు తీరని నష్టం

- దెబ్బతిన్న స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్స్, ఇన్సులేటర్లు
- సుమారు 5 కోట్లకుపైగా నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 2: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎన్పీడీసీఎల్‌కు తీరని నష్టం వాటిల్లింది. వరదనీటి ధాటికి పలు స్తంభాలు పూర్తిగా దెబ్బతినడం, నేలమట్టం కావడం, పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్, ఇన్సులేటర్లు దెబ్బతినడంతో విద్యుత్ సరఫరాలకు ఆటంకం కలిగింది. విద్యుత్ సిబ్బంది యుద్ధప్రాతిపదిక మరమ్మతుల చేపట్టి కమర్షియల్, డొమెస్టిక్ సర్వీసులకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మహబూబాబాద్ జిల్లాలోని చిన్నగూడూరు, నర్సింహులపేట, మరిపెడ, ఎల్లంపేట మండలాల్లో వర్షపాతం ఎక్కువగా ఉండటంతో ఆ ప్రాంతాల్లో విద్యుత్ శాఖకు ఎక్కువగా నష్టం జరిగింది. ఆకేరువాగు తాకిడికి ఉల్లంపల్లిలో 33 బై 11 కేవీ సబ్‌స్టేషన్ నీట మునగడంతో కంట్రోల్‌రూమ్, ప్యానల్స్, ఇతరత్ర సామగ్రి దెబ్బతిన్నాయి. జిల్లాలో ప్రవహిస్తున్న పాలేరు, ఆకేరు, మున్నేరు, పాఖాలవాగు తీరం వెంబడి ఉన్న వ్యవసాయ కనెక్షన్లకు సంబంధించి సుమారు 900 విద్యుత్ స్తంభాలు దెబ్బతినడంతో పాటు కొన్ని నెలకొరగగా, 150 పైగా ట్రాన్స్‌ఫార్మర్స్ నీట మునగడం, ప్లింత్ నుంచి నీటిలో పడిపోయాయి. తాత్కాలికంగా విద్యుత్ సరఫరా చేసేందుకు వీటిన్నింటి మరమ్మతులకు కలిపి సుమారు రూ.40 లక్షల వరకు అంచనా వేస్తుండగా పూర్తి స్థాయిలో మరమ్మతుల చేసేందుకు సమారు రూ.2కోట్ల వరకు ఖర్చు అవుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. నివాసాలకు సరఫరా చేసే విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మలు విరిగిపడి చాలా చోట్ల తీగలు తెగిపోగా వెంటనే సిబ్బంది రంగంలోకి దిగి పునరుద్ధరించినట్లు తెలిపారు. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేస్తూ అంతరాయాలు లేకుండా చేసే ప్రయత్నం చేశారు. కొన్ని చోట్ల సబ్‌స్టేషన్‌ల్లోకి నీరు చేరడంతో ప్రత్యామ్నాయ పద్ధతిలో పక్క సబ్‌స్టేషన్‌ల నుంచి విద్యుత్‌ను సరఫరా చేశారు.

స్వీయ నియంత్రణ ముఖ్యం

వినియోగదారులు ఎట్టిపరిస్థితుల్లో స్వయంగా విద్యుత్ మరమ్మతులు చేయరాదని వివిధ జిల్లాల సర్కిల్ అధికారులు సూచిస్తున్నారు. విద్యుత్ స్తంభాలు, ఇంట్లోని స్విచ్ బోర్డులను తడిచేతులతో తాకరాదన్నారు. విద్యుత్ అంతరాయంతో పాటు విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్య ఉన్నా.. విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్ 1912, 18004250028 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. అర్ధరాత్రి వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఉన్నతాధికారుల అదేశాలతో విద్యుత్‌ను పునరుద్ధరించిన సిబ్బందిని ఆయా జిల్లాల ఎస్ఈలు ప్రత్యేకంగా అభినందిచారు.



ములుగు జిల్లాలో క్రేన్ సహాయంతో కొత్త పోల్‌ను ఏర్పాటు చేస్తున్న విద్యుత్ అధికారులు

దెబ్బతిన్న చోట వెంటనే పునరుద్ధరణ పనుల చేపట్టాలి

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటీ వరుణ్‌రెడ్డి

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 3: మరో రెండు రోజులు భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని టీజీ ఎన్పీడీసీఎల్ కర్నాటీ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలతో మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. మహబూబాబాద్, భూపాలపల్లి, ఖమ్మం జిల్లాల్లో వరదల కారణంగా చెట్లు విరిగిపడి చాలా చోట్ల విద్యుత్ తీగలు తెగడం, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నీటమునగడం, ఇన్సులేటర్లు దెబ్బతినడం జరిగాయన్నారు. వాటి పనులను వేగంగా పునరుద్ధరణ చేయాలని ఆదేశించారు. కావాల్సిన మెటీరియల్, సిబ్బందిని అందిస్తామన్నారు. మునిగిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల వద్ద నీటి ప్రవాహం తగ్గిన తర్వాత పునరుద్ధరణ పనులు చేపట్టాలన్నారు. వర్షాల కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నా యంగా మరొక సబ్‌స్టేషన్ నుంచి సరఫరా ఉండేలా ముందస్తుచర్యలు చేపట్టాలన్నారు. తద్వారా అంతరాయలు తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు బి.అశోక్‌కుమార్, టి.సదర్‌లాల్, టి.మధుసూ దన్, సీజీఎం రాజు చౌహాన్, జీఎంలు నాగప్రసాద్, మల్లిఖార్జున్, అన్నపూర్ణ, శ్రీనివాస్, అంకుశ్, డీఈలు అనిల్‌కుమార్, శ్రీధరాచారి, రమణారెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నష్టం

భూపాలపల్లి జిల్లాలో 263 స్తంభాలు, 2 పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్, 9 డీటీఆర్‌లు దెబ్బతినగా సుమారు 1.60 లక్షల నష్టం వాటిల్లినట్లుగా విద్యుత్ అధికారులు అంచనా వేశారు. వరంగల్ జిల్లాలో ఇప్పటి వరకు 193 విద్యుత్ పోల్స్, 95 ట్రాన్స్‌ఫార్మర్స్ దెబ్బతినగా 1.20 లక్షల నష్టం వాటిల్లిందని, ఇంకా ఈ నష్టం పెరిగే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. జనగామలో 22 విద్యుత్ స్తంభాలు, 2 ట్రాన్స్‌ఫార్మర్స్ దెబ్బతినగా 2 లక్షల నష్టం వాటిల్లిందని అంచనాకు వచ్చారు. హనుమకొండ జిల్లాలో 18 పోల్స్, 23 ఇన్సులేటర్లు, 1 ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతినగా రూ.1.8 లక్షల నష్టం జరిగిందని అధికారులు తెలిపారు.

మనస్తాపంతో ఉరి వేసుకొని ఆత్మహత్య



మహేందర్ (ఫైల్)

ధర్మసాగర్, సెప్టెంబర్ 3: ఉరి వేసుకొని మొగిలిచర్ల మహేందర్ (38) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై పోచయ్య మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామానికి చెందిన మహేందర్ 18 ఏళ్ల కిందట రఘునాథపల్లి మండలం తాటికాయల గ్రామానికి చెందిన రమతో వివాహమైంది. గ్రామంలోనే లాండ్రీషాపు నడుపుకుంటూ ఇద్దరు జీవిస్తున్నారు. వీరికి సంతానం కాకపోవడంతో రమ మానసికంగా అనారోగ్యానికి గురైంది. దీంతో నాలుగు నెలల కిందట రమ తల్లిదండ్రులు ఆమెను పుట్టింటికి తీసుకెళ్లారు. దీంతో భార్య రావడం లేదని మనస్తాపం చెందిన మహేందర్ సోమవారం రాత్రి హనుమకొండలో ఉంటున్న తన అక్క స్వరూపకు ఫోన్ చేసి తాను చనిపోతున్నానని చెప్పాడు. మంగళవారం తెల్లవారుజామున స్వరూప మహేందర్‌కు ఫోన్ చేయగా ఎంతకూ ఫోన్ ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి చుట్టుపక్కల వారికి ఫోన్ చేసి తమ్ముడు మహేందర్ ఫోన్ ఎత్తడం లేదని చెప్పడంతో వారు మహేందర్ ఇంటికి వెళ్లి కిటికీలోంచి చూశారు. మహేందర్ ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయన్ని మృతుడి కుటుంబ సభ్యులకు, గ్రామస్థులకు తెలపడంతో వారు విచ్చేసి స్థానికుల సాయంతో పోలీసులకు సమాచారాన్ని అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి విచ్చేసి మృత దేహాన్ని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాగులో పడి రైతు గల్లంతు

నెక్కొండ మండలం గుండ్రపల్లి శివారులో ఘటన



గల్లంతైన రైతు అజ్‌మత్

నెక్కొండ, సెప్టెంబరు 3: వాగు దాటుతుండగా రైతు గల్లంతైన ఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గుండ్రపల్లి గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు, రెవెన్యూ అధికారుల కథనం ప్రకారం. గ్రామానికి చెందిన షేక్ అజ్‌మత్ (35) వ్యవసాయ పనుల కోసం వెళ్లాడు. పనులు ముగించుకుని ఇంటి బయలుదేరాడు. గ్రామ శివారులోని పట్టెవాగు దాటుతుండగా నీటి ప్రవాహం పెరగడంతో వాగులో కొట్టుకుపోయాడు. సమీపంలోని రైతులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. విషయం తెలుసుకున్న నెక్కొండ తహసీల్దార్ రాజ్‌కుమార్, చెన్నారావుపేట ఎస్సై అరుణ్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని రైతు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అజ్‌మత్‌కు భార్య చాందిని, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

కారును ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

● ఇళ్ల మధ్యలోకి దూసుకెళ్లిన కారు ● తప్పిన ప్రమాదం

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 3 : ఫత్తేపురం గ్రామస్టేజీ వద్ద కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం. సూర్యాపేట నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి ఫత్తేపురం గ్రామం నుంచి రోడ్డు మీదకు వస్తున్న కారును ఢీకొట్టింది. పక్కనే ఉన్న ఇళ్ల మధ్యలోకి కారు దూసుకెళ్లి పాక్షికంగా దెబ్బతింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరుగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

మార్చురీలో మృతదేహం

బయ్యారం, సెప్టెంబరు 3 : గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలోని మార్చురీలో మంగళవారం భద్రపరిచినట్లుఎస్సై తిరుపతి తెలిపారు. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు బయ్యారం పాకాల ఏరు సమీప జామాయిల్ తోటలోకి గుర్తుతెలియని పురుషుడి మృతదేహం సోమవారం కొట్టుకురాగా, జిల్లా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. చర్మం మొత్తం తెల్లబడి ఉన్నదని వివరాలు తెలిసిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు.

కందికొండ ఆలయ గోపురం ధ్వంసం

కురవి, సెప్టెంబరు 3 : కందికొండ గ్రామపర్వతంపై ఉన్న శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ గోపురం ధ్వంసమైంది. గత కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆలయ గోపురం ధ్వంసమైనట్లు తెలుస్తోంది. కందికొండ పర్వతంపై సుమారు 3 కిలోమీటర్ల ఎత్తులో లక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఉంది. మంగళవారం మేకలు మేపేందుకు వెళ్లిన కాపరులు గుడి గోపురం ధ్వంసమైనట్లు గుర్తించి గ్రామస్థులకు సమాచారం అందించారు. ప్రతీ సంవత్సరం కార్తీక పౌర్ణమినాడు కందగిరి పర్వతంపై లక్ష్మీనర్సింహస్వామి జాతర జరుగుతుంది. సుమారు నాలుగు ఉమ్మడి జిల్లాల నుంచి భక్తులు ఈ జాతర కోసం తరలివస్తారు.

అస్వస్థతకు గురై మహిళ మృతి

కేసముద్రం, సెప్టెంబరు 3 : కేసముద్రం విలేజి ఎన్టీఆర్ నగర్‌లో వరద నీటిలోంచి బయటపడి తీవ్ర అస్వస్థతకు గురై బాదావత్ వాణి (55) మంగళవారం మృతి చెందినట్లు కాలనీవాసులు తెలిపారు. కాలనీ చివరన కాల్వ పక్కనేఉన్న వాణి ఇంట్లోకి శనివారం రాత్రి భారీగా వరద నీరు వచ్చింది. కాలనీ వాసులు ఆమెతో పాటు ఆమె భర్త జయరాంను నీటిలోంచి కాపాడి తీసుకువస్తుండగా వాణి రెండుసార్లు నీళ్లలో మునిగింది. ఆ తర్వాత తీవ్ర అస్వస్థతకు గురై స్థానిక వైద్యులకు చూపించుకుంది. ఈ క్రమంలో ఉదయం మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

వర్షాలకు గండ్లుపడిన చెరువులు

● ఫామ్‌లలో మృతి చెందిన కోళ్లు

నెల్లికుదురు, సెప్టెంబరు 3 : భారీ వర్షాలకు సోమవారం రాత్రి నైనాల, కాచికల్ చెరువులకు గండిపడి భారీనష్టం జరిగింది. నైనాలలో కేశబోయిన కుంటచెరువు తెగిపోవడంతో 30 ఎకరాలలో వరినాట్లు కొట్టుకపోయాయి, 30 గొర్రెలు కొట్టుపోయి మృతి చెందాయి. కాచికల్ చెరువు తెగడంతో నీటి ఉధృతికి దానికిందున్న కట్టుకాలువ కట్ట తెగడంతో 50ఎకరాలలో వరిపొలాలు కొట్టుకపోయాయి. మునిగలవీడు గ్రామంలో చిన్నబోయిన సతీష్‌కు చెందిన కోళ్ల ఫామ్‌లో రూ.10 లక్షల విలువచేసే కోళ్లు కొట్టుకపోయి మృతిచెందాయి.

150 కుటుంబాలకు కాంగ్రెస్ సాయం


నిత్యావసరాలను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కేసముద్రం, సెప్టెంబరు 3 : కేసముద్రం స్టేషన్ సంతోష్‌నగర్‌కాలనీ, రామ మందిరం వీధి, హైస్కూల్ ప్రాంతాల్లో ముంపునకు గురై నష్టపోయిన 150 కుటుంబాలకు కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో రూ.లక్ష విలువైన బియ్యం, సరుకులను అందజే శారు. సుమారు 18 క్వింటాళ్ల బియ్యం, నిత్యావసర వస్తువులను సమకూర్చి బాధి తులకు పంపిణీ చేసినట్లు మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు తెలిపారు. జిల్లా నాయకులు గంట సంజీవరెడ్డి, బండారు దయాకర్, కదిరె సురేందర్, బండారు వెంకన్న, రావుల మురళి, వోలం రమేష్, కూరెల్లి సతీష్, దామరకొండ ప్రవీణ్‌కుమార్, పోలెపల్లి వెంకట్‌రెడ్డి, కనుకుల రాంబాబు, చిదిరాల వసంతరావు, పోలెపాక నాగరాజు, ఆంగోత్ బాల పాల్గొన్నారు.

పొలాలు, చేలల్లో ఇసుక మేటలు

కురవి, సెప్టెంబరు 3 : భారీ వర్షాలు.. వరదలతో కురవి మండలంలోని అనేక గ్రామాల్లో పొలాలు, చేలల్లో ఇసుక మేటలు వేసింది. పెద్దమొత్తంలో పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటల్లో ఇసుక మేటలు వేయడంతో రైతులు ఆందోళనతో కన్నీటి పర్యంతమవుతున్నారు. వ్యవసాయాధికారులు త్వరగా పంటనష్టం అంచనా వేసి, తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

● సీఎంకు ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ విజ్ఞప్తి


మాట్లాడుతున్న జాటోత్ రాంచంద్రునాయక్

మరిపెడ, సెప్టెంబరు 3 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు డోర్నకల్ నియోజకవర్గంలో నష్టపోయిన వారిని ఆదుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ విజ్ఞప్తి చేశారు. పలు తండాలు, అనేక మంది రైతుల పంటలు ముంపునకు గురై వందలాది పశువులు, వ్యవసాయ పనిముట్లు ఆకేరు, పాలేరు నదుల వరద ఉధృతికి గల్లంతు అయ్యాయని ఆ బాధిత కుటుంబాలకు సాయం చేయాలని కోరారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి, సీతక్కతో కలిసి తండాధర్మారం శివారు సీతారాంతండా ముంపు బాధిత కుటుంబాలను కలుసుకొని పరామర్శించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ ఆ తండా ప్రజలు ముంపురోజు పడ్డ కష్టాలను సీఎం రేవంత్‌రెడ్డికి వివరించారు. ఇప్పటికే ఈ తండావాసులు గతంలో సైతం ఈ ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు గుర్తు చేశారు. సీతారాంతండా, తేజావత్ తండా, భూక్యాతండా ఆకేరు ఉప్పొంగినప్పుడు ఇళ్లల్లోకి వరద నీరు చేరి, అనేక అవస్థలు పడుతున్నారని వీరికి శాశ్వత పరిష్కారానికి చొరువ చూపాలని ముఖ్యమంత్రికి విన్నవించారు. దీంతో స్పందించిన సీఎంఈ మూడు తండాలను ఒకే చోటికి చేర్చి, ఒకే గ్రామపం చాయతీ కిందికి తెచ్చి, అన్ని సౌకర్యాలను కలిపించాలనిమహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. నీటి ముంపునకు గురైన తండా వాసులకు ఇంటికి రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించారు. బాధిత రైతులకు ఎకరాకు రూ.10 వేల నష్టపరిహారం అందిస్తామన్నారు. వ్యవసాయ అధికారులు వెంటనే సమగ్రా నివేదిక తయారు చేయాలన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డితో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ బలరాంనాయక్, కలెక్టర్ అద్వైత్‌కుమార్, ఎస్పీ సుధీర్‌నాంనాథ్‌కేకన్, మహబూబాబాద్, భూపాలపల్లి ఎమ్మెల్యేలు మురళీనాయక్, గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఏఎస్పీ చెన్నయ్య, ఆర్డీవో నర్సింహారావు, కాంగ్రెస్ నేతలు నరేశ్‌రెడ్డి, యుగేందర్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గునిగంటి కమలాకర్, అంబరీశ, రాంలాల్, మెంచు అశోక్, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రవినాయక్, తాజుద్దీన్, అఫ్జల్, అప్సర్, వెంకటసాయి పాల్గొన్నారు.

'ప్రతీ ఎకరానికి రూ.10 వేలు ఇవ్వాలి'

చిన్నగూడూరు, సెప్టెంబరు 3 : భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని ఆకేరు వద్ద ధ్వంసమైన రోడ్డు, గంగమ్మ అలయం, జయ్యారం చెరువును ఎంపీ బలరాంనాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టపోయిన ప్రతీ రైతుకు ఎకరాకు రూ.10వేలు, పాడిపశువులకు రూ.50వేలు. గొర్లకు 5వేలు వరద బాధిత కుటుంబాలకు 10 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. వర్ష సూచనలు ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలను విషజ్వరాల బారిన పడకుండా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ అలీ, ఎంపీడీవో రామారావు, డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కమలాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాగేష్, రంజిత్ రెడ్డి, వీరన్న, బిక్కు, జహంగీర్, ఆదాం, రాజు, జగన్, శ్రీపాల్, కిరణ్ ఉన్నారు.

జిల్లాను వదలని ముసురు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 3 : జిల్లాను వర్షం వదలలేదు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లా అతలాకుతలం కావడం, భారీ నష్టాన్ని చవిచూసింది. పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వర్షం తగ్గినట్లే కన్పించినప్పటికి మంగళవారం ఉదయం నుంచి మళ్లీ ముసురు అలుముకుంది. వాన పూర్తిగా తగ్గకపోవడంతో పొద్దంతా చిన్నచిన్న చినుకులు పడ్డాయి. ఇప్పటికే వర్షంతో తడిసి ముద్దయిన పల్లెలు, పట్టణాల రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రోడ్లపై నిలిచిన బురదను జేసీబీ సాయంతో తొలగిస్తున్నారు. బంధం చెరువు వద్ద జరుగుతున్న నాలాక్లియర్ పనులను చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగుకుండా పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్దన్, ఏతం కుమార్ పాల్గొన్నారు.

73.2 మిల్లీ మీటర్ల వర్షం..

జిల్లా వ్యాప్తంగా 73.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, సగటున 4.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలోని కొత్తగూడ మండలంలో 4.2 మిల్లీమీటర్లు, గంగారంలో 7.2, బయ్యారంలో 2.6, గార్లలో 7.8, డోర్నకల్‌లో 4.2, కురవిలో 2.8, మహబూబాబాద్‌లో 3.8, గూడూరులో 5.8, కేసముద్రంలో 6.4, నెల్లికుదురులో 5.8, నర్సింహులపేటలో 4.0, చిన్నగూడూరులో 1.2, మరిపెడలో 3.8, దంతాలపల్లిలో 3.2, తొర్రూరులో 6.8, పెద్దవంగర మండలంలో 3.6 మిల్లీ మీటర్ల వర్ష పాతం నమోదైంది.

ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలి : సీపీఎం


గుండ్లకుంట ప్రాంతాన్ని సందర్శిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 3 : భారీ వర్షాలతో ఇళ్లు కూలిపోయిన బాధితులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పట్టణంలో వరద ముంపు ప్రాంతం గుండ్లకుంట కాలనీని మంగళవారం సీపీఎం ప్రతినిధి బృందం పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ...ప్రకృతి వైపరీత్యం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు పడగా మానుకోటలో ఎన్నడు చూడని విధంగా ఎడతెరిపి లేని వర్షాలు కురవడంతో తీవ్రంగా నష్టం వాటిల్లిందని చెప్పారు. పేదలు నివసిస్తున్న శివారు కాలనీలో భారీ వర్షాలకు ఇళ్లలోకి నీరు వచ్చి ఇళ్లు కూలిపోయాయని వారికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను ఇచ్చి ఆదుకోవాలన్నారు. అదే విధంగా ధ్వంసమైన రోడ్లను బాగుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి, పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్, రావుల రాజు, చీపిరి యాకయ్య, కుమ్మరికుంట్ల నాగన్న, శాగంటి భాగ్యమ్మ, తోట శ్రీను, వెంకన్న, లక్ష్మణ్, శ్యామ్, భిక్షపతి, ముత్యాలరవి, రాజేశ్వరీ, వెంకటాద్రి పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉండాలి : సీపీఎం



రాంపురం వద్ద బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ ఆందోళన చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

గార్ల సెప్టెంబర్ 3 : మండల పరిధిలోని రాంపురం సమీపంలోని పాకాల ఏటిపై వంతెన నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉండాలని సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం పాకాల ఏటి వద్ద సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు వచ్చినప్పుడల్లా ఓట్ల కోసం వంతెన నిర్మిస్తామని చెప్పి గెలిచాక హామీని విస్మరిస్తున్న ప్రజాప్రతినిధుల విధానాలను విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంగూరి పెద్ద వెంకటేశ్వర్లు, అంబటి వీరస్వామి, ఎ.రామకృష్ణ, మహేశ్వరరావు, వీరభద్రం, అశోక్, నాగేశ్వరరావు, భిక్షం, కోటయ్య, రాంబాబు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించాలి

పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి పనులు మొదలు పెట్టాలని కోరుతూ ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డికి పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ వినతిపత్రం అందజేశాడు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గంగారం తండాకు సీఎం రేవంత్‌రెడ్డితో విచ్చేసి వేంను కలిసి వంతెన నిర్మాణంపై వివరించారు.

గాయపడిన యువకుడు మృతి

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 3 : చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు మున్నేరువాగు సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. పట్టణంలోని రెడ్యానాయక్ కాలనీకి చెందిన ముత్యాల విజయ్‌కుమార్ తన స్నేహితులతో కలిసి ఆగస్టు 28న రాత్రి జమాండ్లపల్లి నుంచి ద్విచక్రవాహనంపై మహబూబాబాద్‌కు వస్తున్నాడు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఖాదర్‌పేట గ్రామానికి లావుడ్య శ్రీను తన కారు ద్వారా మహబూబాబాద్ నుంచి నర్సంపేటకు వెళ్తున్న క్రమంలో మున్నేరువాగు దాటగానే విజయకుమార్‌ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో విజయ్‌కుమార్ తలకు తీవ్రగాయాలు అయ్యాయి. ఇది గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం 108లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ అస్పత్రికి తరలించగా అక్కడి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతునికి తల్లి ముత్యాల లక్ష్మి ఉన్నారు. విజయ్ కుమార్ సోదరుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'రైతులకు పంట నష్ట పరిహారం అందించాలి'

● రైతు సంఘం నాయకులు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 3 : భారీ వర్షాలతో నష్ట పోయిన రైతాంగానికి ఎకరాకు రూ. 20 వేలు నష్ట పరిహారం కేంద్ర ప్రభుత్వం చెల్లించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గునిగంటి రాజన్న, రాష్ట్ర కమిటీ సభ్యుడు నల్లపు సుధాకర్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు రేగడి తండా, మల్యాల, రజాలిపేట, బేతోలు గ్రామాల్లో వర్షాలతో దెబ్బతిన్న పంటలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాలో సర్వే నిర్వహించి దెబ్బతిన్న పంటలను గుర్తించి, తక్షణమే పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలన్నారు. జిల్లాలో 1590 చెరువులుండగా, అందులో 68 చెరువులకు గండ్లు పడ్డాయని ఆయా చెరువుల కింద పొలాల్లో ఇసుకమేటలు వేశాయని చెప్పారు. నష్టపోయిన ప్రతీ పంటకు పరిహారం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో దుడ్డెల రాంమూర్తి, చేపూరి గణేష్, గాడిపెల్లి వెంకన్న, చందునాయక్, భాను, వీరన్న,షరీఫ్, రేణుక, కేశవులు, ఆకుల రమేష్ పాల్గొన్నారు.

నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలి

● మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బానోత్ శంకర్‌నాయక్

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 3 : వర్షాలతో నష్టపోయిన ప్రతీ ఒక్కరిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. మహబూబాబాద్‌లో మంగళవారం ఏర్పాటు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహబూబాబాద్ నియోజకవర్గ పరిధిలోని నెల్లికుదురు మండలం రావిరాలలో వర్షంతో తీవ్ర నష్టం జరిగితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటనకు వచ్చి కనీసం రావిరాలను సందర్శించలేదని విమర్శించారు. సీఎం పర్యటనతో నిధులు కేటాయించి తమను ఆదుకుంటారని ఆశపడ్డ ప్రజలకు నిరాశ మిగిలిందన్నారు. జిల్లాలో అధికారుల ముందస్తు హెచ్చరికలు జారీ చేయకపోవడంతో నష్టం వాటిల్లిందన్నారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు కనీసం ప్రయత్నం కూడా చేయలేదన్నారు. యుద్ధ ప్రాతిపదికన నష్టాన్ని అంచనా వేసి రైతులను, ప్రజలను ఆదుకోవాలన్నారు. ఇళ్లు కూలిపోయిన వారికి గృహాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కన్పిస్తుందని ఆరోపించారు. ఖమ్మం జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లో మాజీమంత్రి హరీష్‌రావు, సీనియర్ నాయకులు పర్యటిస్తే వారిపై దాడులు చేయడం హేయమైన చర్య అని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఎమ్డీ. ఫరీద్, లూనావత్ అశోక్‌నాయక్, గోగుల రాజు తదితరులు పాల్గొన్నారు.

● నెల్లికుదురు : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జలయమైన మండలంలోని రావిరాల గ్రామస్థులను మంగళవారం మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు రాకేష్‌రెడ్డి పరామర్శించారు. ఆలేరులో చెరువు తెగిపోవడంతో చెరువుగండిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు రావిరాల చెరువులు తెగిపోయాయని ఇండ్లు కూలిపోయాయని గొర్రెలు కోళ్ళ,'పశువులు మృతిచెందాయన్నారు. ప్రభుత్వం తక్షణసహాయం అందించాలన్నారు. ఇందిరమ్మఇండ్లు నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాస్‌రెడ్డి, షరీఫ్, పులి రామచంద్రు, కుమార్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి : ఏఐకేఎంఎస్

బయ్యారం, సెప్టెంబరు 3 : వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను అన్ని విధాల ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న పంటలను మంగళవారం ఏఐకేఎంఎస్ బృందం పరిశీలించి, తహసీల్దార్ విజయకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భారీస్థాయిలో నష్టం వాటిల్లితే జిల్లాకు కేవలం రూ.5 కోట్లు కేటాయించడం విచారకరమన్నారు. దెబ్బతిన్న మిర్చి పంటకు ఎకరాకు రూ.లక్ష చొప్పు, పత్తి, వరి పంటలకు రూ.75 వేలు, మొక్కజొన్న పంటకు రూ.50 వేలు చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా వర్షాలకు దెబ్బతిన్న చెరువులు, కుంటలు, కల్వర్టులతో పాటు తెగిపోయిన రోడ్లుకు తక్షణమే మరమత్తులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, మురళి, రమణారెడ్డి, శంకర్, రాముడు, కృష్ణ, నిరంజన్, సైదులు, ఉప్పలయ్య, సాంబన్న, సురేష్ పాల్గొన్నారు.

నష్ట పరిహారం అందించాలని వినతి


నయాబ్‌తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బంధం చెరువు పరివాహక రైతులు

నర్సింహులపేట, సెప్టెంబరు 3 : వర్షబీభత్సంతో తీవ్రంగా నష్టంవాటిల్లిందని ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందించాలని కోరుతూ మండల కేంద్రానికి చెందిన పలువురు రైతులు మంగళవారం నయాబ్ తహసీల్దార్ సంజీవకు వినతిపత్రం అందజేశారు. బంధం చెరువు పరివాహకం కింద ఉన్న రైతులు అలువాల నవీన్, బొమ్మిశెట్టి వెంకన్న, నర్సయ్య, గుండాల భిక్షం, బేతమల్ల రమేష్ తెలిపిన వివరాల ప్రకారం. బంధం చెరువు కింద 105 మందికి చెందిన సుమారు 180 ఎకరాలు ఉన్నట్లు తెలిపారు. తుఫాన్ తీవ్రత వల్ల వర్షబీభత్సం ఏర్పడిందన్నారు. మత్స్య సొసైటీ వారు మత్తడి వద్ద ఇనుప కంచె ఏర్పాటు చేయడంతో వరుద ఉధృతి తీవ్రమై కట్టకు మూడుచోట్ల గండి పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వరద ఉధృతికి 30 నుంచి 40 ఎకరాలల్లో ఇసుక మేటలు వేసి లక్షల్లో నష్టం వాటిల్లిందన్నారు. మత్స్య సొసైటీ వారిపై చర్యలు తీసుకుని పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందించాలన్నారు. కాగా, మండల వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్ రైతుల వినతి మేరకు బంధం చెరువు పరివాహకాన్ని సందర్శించి, వరద ఉధృతి నష్టాన్ని అంచనా వేశారు. ఈ కార్యక్రమంలో రైతులు రాములు, సోమిరెడ్డి, సుదర్శన్, నర్సయ్య, భిక్షం, బక్కయ్య ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌కు రూ.5 వేల విరాళం

తొర్రూరు రూరల్, సెప్టెంబరు3 : అకాల వర్షాలతో నష్టపోయిన వారికి సీఎం సహాయ నిధికి మదర్ వలంటరీ ఆర్గనైజేషన్ ఫౌండర్ సిరికొండ విక్రమ్‌కుమార్ రూ.5వేల విరాళం చెక్కును మంగళవారం చెర్లపాలెం గ్రామంలో తహసీల్దార్ వినోద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వినోద్‌కుమార్ నిత్యం ప్రజలకు సేవలందిస్తున్న మదర్ వలంటరీ సంస్థ సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బషీర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అనిల్‌కుమార్, సంస్థ ప్రతినిధులు కాసోజు శ్రీనాథచారి, రాజేష్, శ్రీధర్, వెంకట్ రెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.

భారీ వర్షాలకు అపార నష్టం

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 3 : ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తొర్రూరు మండలంలో పంటలు, ఇళ్లకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలో మంగళవారం వర్షం కొంత తగ్గుముఖం పట్టింది. నీట మునిగిన పంటలపై మట్టి, ఇసుక మేట వేశాయి. తహసీల్దార్ వినోద్ కుమార్ మాట్లాడుతూ మండలంలోని 15 ఇండ్లు ధ్వంసం అయినట్లు తెలిపారు. నిరాశ్రయులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని మడిపల్లి, కంఠాయపాలెం, హరిపిరాల గ్రామాల్లోని పలువురు రైతుల పంటలపై ఇసుక మేటలు దర్శనమిస్తున్నాయి. కంఠాయపాలెం కొండ మల్లయ్య 3ఎకరాల వరి పంట ఇసుక పేరుకుపోగా, అమ్మాపురం శివారులో కిన్నెర తులసిరాం 20 గుంటల పొలంలో రాళ్లు, ఇసుక పేరుకుపోయింది. కాగా, 673 రైతులకు 795 ఎకరాల పత్తి, 590 మంది రైతులకు సంబంధించి 660 ఎకరాల వరి పంట ధ్వంసమైనట్లు ఏవో మురళీమోహన్ వెల్లడించారు. అలాగే 30 ఎకరాల బొప్పాయి తోట, 675 ఎకరాల మిర్చి పంట వర్షాలకు దెబ్బతిన్నట్లు అధికారులు వెల్లడించారు. ఇంకా పంట నష్టాన్ని సర్వే చేస్తున్నట్లు తెలిపారు.

నష్టపోయిన అయోధ్య రైతులను సర్కారు ఆదుకోవాలి

సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 3 : గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో అయోధ్య పెద్ద బంధం చెరువు తెగిపోయి సమీపంలోని పంట పొలాల రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బి.అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ నాయకులతో కలిసి పంట పొలాలు కొట్టుకుపోయిన ప్రాంతాలను, గండిపడ్డ చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా అజయ్‌సారథి మాట్లాడుతూ... వరదతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కట్లోజు పాండురంగాచారి, తండ సందీప్, పెరుగుకుమార్, చింతకుంట్ల వెంకన్న, వీరవెల్లి రవి, మాలోతు రవీందర్, మురళి, శ్యాంప్రసాద్, రమేష్, రాములు, సోమయ్య, ఉప్పలయ్య, శ్రీనివాస్, భద్రయ్య, వీరన్న, కృష్ణ, లక్ష్మణ్, రవి, అజయ్, సతీష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'చిరువ్యాపారులను ఆదుకోవాలి'

నెహ్రూసెంటర్, సెప్టెంబరు 3 : ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నష్టపోయిన చిరువ్యాపారులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్లోబల్‌పీస్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు భూక్య బాలునాయక్ విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కురవి గేట్ సమీపంలో డబ్బాలు ఏర్పాటు చేసుకుని చిరువ్యాపారం చేసుకుంటున్న దుకాణాదారుల సరుకులు తడిసిపోయి నష్టపోయిన వారిని మంగళవారం పరామర్శించి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా బాలునాయక్ మాట్లాడుతూ... చిరువ్యాపారులు జీవనోపాధి కోసం అప్పులు చేసి చిన్న..చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలనుపోషించుకుంటున్నారని చెప్పారు. అకాల వర్షాలతో కురవి గేటు సమీపంలోని గన్నీ బస్తాల షాపులో బస్తాలు తడిసి లక్షల్లో నష్టం వాటిల్లి వారు బోరున విలపిస్తున్నారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట వేణు, జర్పుల పార్వతి, రాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి

● వామపక్షాల నాయకుల డిమాండ్

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 3: వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే పరిహారం చెల్లించాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని అమ్మాపురం శివారులోని మొక్కజొన్న, వరి పంటలను సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, సీపీఎం జిల్లా నాయకులు బొల్లం అశోక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎకరాకు రూ.30 వేల పరిహారం ఇవ్వాలని, ధ్వంసమైన నర్సంపేట-తొర్రూరు రహదారికి వెంటనే మరమ్మతు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీ నాయకులు ఓమ భిక్షపతి, యాకూబ్, మహేందర్, వెంకట్ రెడ్డి, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటాం

● ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

నెహ్రూసెంటర్, సెప్టెంబరు 3 : ఇటీవల కురిసిన వర్షాలతో వరద ముంపుకు గురైన బాధితులకు అండగా ఉంటామని ఎమ్మెల్సీ చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న) అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కేటీఆర్ కాలనీలో మంగళవారం ఆయన వరద బాధితులను పరామర్శించి దుస్తులు, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈసందర్భంగా మల్లన్న మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే సంక్షేమపథకాల్లో వరద బాధితులకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలతో మాట్లాడి ఇందిరమ్మ ఇళ్లు వచ్చే విధంగా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పులి శ్రీను, దేవి ఉపేందర్, కుక్కల సుధా, కందుకూరి వీరన్న, గుంజే బాబు, సీహెచ్.రాధ, క్రాంతి, సతీష్, భాస్కర్, పద్మ, వీరభద్రం, రమ పాల్గొన్నారు.